# 'తల్లి వ్రూ అంది'

'గుడీవినింగు' — సోల్జరుకుర్రాడు విష్ చేశాడు. అంబ పలుకలేదు. టకటకా జోళ్ళు చప్పుడు చేసుకుంటూ ఆగని ట్రాంబండిలాగ వెళ్ళిపోయింది. సోల్జరు కుర్రాడు నిరాశ చెందలేదు, తనూ వెంటనడిచేడు. అమ్మాయి పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ నడుస్తున్నాది. సోల్జరు కుర్రాడు పైకి కనబడనీయకుండా తనూ పెద్దఅడుగులు వేశాడు.

అమ్మాయి ఇంట్లో ఒక అయస్కాంతం వుంది. ఒక సాలెపట్టూ ఉంది. సోల్జరు ఒక ఇనుపరజం కానీ, ఈగ కానీ కావచ్చు. అమ్మాయి ఒక సినిమాథియేటరుముందు ఆగింది. బొమ్మలు చూస్తున్నాది. సోల్జరు ఆగేడు. కొంతదూరంలో నిలబడి, రోడ్డుమీద నిలబడి,రోడ్డుమీద రాకపోకలు చూస్తున్నాడు. అమ్మాయి బొమ్మలు అతిధ్యాసతో చూస్తున్నది. బహుశా నటిస్తున్నది. సోల్జరూవచ్చి బొమ్మలు చూస్తున్నాడు, బహుశా నటిస్తున్నాడు. అమ్మాయి సోల్జరు వేపు చూడనట్లు నటిస్తూ చూసింది. సోల్జరు చూసీ చూడనట్టుగా చూశాడు. అమ్మాయి అక్కణ్ణించి కదిలింది, నడిచింది. పెద్దఅడుగులతో నే నాల్గడుగులు వేసి ఆగిపోయింది. ఎవరికోసమో నిరీక్షిస్తూన్నది. సోల్జరుబొమ్మలుచూడ్డంఆపి దిక్కులు చూసి అమ్మాయివేపు నడిచాడు, దగ్గరకొచ్చాడు. ఒక పేపరు కుర్రాడు ఖర్మంచాలకో అదృష్టం బాగుండో వాడొచ్చి పేపరుకొంటారా అని ప్రశ్నిస్తున్నట్లు నించున్నాడు.

నించోడంతోనే ప్రశ్నించాడు. సోల్జరు పేపరు కొన్నాడు. పావలాఇచ్చి చిల్లర పుచ్చుకోలేదు. అమ్మాయి యిప్పుడు కూడా చూసీచూడనట్టు చూస్తూన్నది. ఇద్దరికీ ఎంతో దూరం లేదు.

పేపరుచంకలోపెట్టి 'గుడీవినింగు' అని విష్ చేశాడు. అమ్మాయి నన్నా అన్నట్టుచూసి మరుక్షణంలో 'ఓ! గుడీవినింగు' ఎదురు విష్ చేసింది. సోల్జరు ఇద్దరిమధ్యా ఉన్న దూరాన్ని తగ్గించి, దగ్గరకొచ్చి, నాతో ఏదేనా సమా కొచ్చేందుకి అభ్యంతరంవుందా అని అడిగేడు. అమ్మాయి ఆమాట కోసమే ఎదురుచూస్తున్నది కాబట్టి ఏ విధమైన అభ్యంతరం లేదంది.

సోల్జరు మోచేయి కొక్కెంలో అమ్మాయి తన చెయ్యి పెట్టింది. యిద్దరూ బజారులోపడ్డారు. అమ్మాయి పేరు [illegible] సోల్జరుపేరు అనవసరం. ఎడ్వినా పద్దెనిమిదేండ్ల ఆంగ్లోయిండియన్ అమ్మాయి. జననమరణాల రిజిస్ట్రారు ఆఫీసుల్లోకి తరవాత సావకాశంగా వెళ్ళి ఈ అమ్మాయి ఎవ రెవరికి ఎప్పుడు ఎక్కడ పుట్టిందీ చిత్రాలు వెదికి తీద్దాం. అంతదాకా ఈపిల్ల గాలికిపుట్టి ధూళికి పెరిగిందని మనం అనుకొంటే ఆపిల్ల ఏవిధమైన అభ్యంతరం చెప్పదు.

ఎడ్వినా ఎక్కడకాపురం ఉంటున్నదీ కావలిస్తేచెప్ప గల్నుగానీ, ఎల్లా? వినా ప్రస్తుతం ఒకవిధమైన ఆర్జనపరు రాలు. యుద్ధమున్నంతకాలం ఒకవిధమైన దీక్షాపరురాలు! మీరు ఆపిల్ల గురించి, ఇంకా భోగట్టాలు అడగొద్దు. కావ

లిస్తే మనం వాటివెనకే పోదాం. పాఠక మహాశయా! మనం పత్తేదారుని అనుసరించెదముగాక!

వినాని సోల్జరు అడిగేడు, షాపింగ్‌కు వెళదామా అని! వినా అతణ్ణి ఎల్లాగా అంగుకు లాక్కెళ్ళే మనిషి, వాళ్ళేను టాయిలెట్ సామాన్లు చాలా కొన్నారు ఒకషాపులో నగ మంచిగాను ఉంది, కొంటావా అంది. కొన్నా? అని అడిగేడు, కొనలేదు.

ఒక సోఫాలో కూర్చున్నారు. ఎక్కడ ఎందుకు అనే ప్రశ్నలను రానివ్వవద్దు. సోల్జరు జేబులోని ఫొటో తీసి వినాకి చూపించాడు. ఈమె నా పెళ్లాం అన్నాడు. వినా ఊం బావుంది అంది. ఈ అబ్బాయి నా కొడుకన్నాడు. ఇలాంటి వాడు నాకు పుడితే బావుణ్ణు అంది. ఇది బొంబాయిలో ఓ పిల్లది అన్నాడు. వినా మాట్లాడలేదు.

సోల్జరు నిన్న తనపుట్టిన రోజన్నాడు. వినా వారం రోజులతరువాత తన పుట్టినరోజని చెప్పి అతణ్ణిఆనాడు విందుకు పిలిచింది, ఎడ్రసు ఇచ్చింది. సిగరెట్టుతీసి వినా కొకటి ఇచ్చేడు. కాల్చింది.

ఇంగ్లండునుంచి నిన్న దిగిన సిగరెట్లు. విందునాటికి ఆ గౌను కొంటానని సోల్జరు మాట యిచ్చేడు.

సోల్జరుకి కొన్ని హిందీముక్కలువచ్చు వినానిచూసి యూ పక్షీ రాజా అన్నాడు, షికారీవాలా అన్నాడు. తని కిదో అనిందో పైసా దేఖో యిష్టంలేదన్నాడు. అది ఖరాబు అని వెలిబుచ్చేడు.

కొంతరాత్రి తరవాత.

* * *

వినా యింటికి చేరుకుంది. యిల్లు చాలా పెద్దది. అందమైనది. ఫర్నిచరు బోల్డంతవుంది. వినా తల్లి చిరుగుల పాతగౌను తొడుక్కునివుంది. తల్లి ఏమిటో అడిగింది, పిల్ల ఏమిటో చెప్పింది. తల్లికి పిల్ల తను కొన్న (బహుశా-కొని పించినది అనేది సరియైనమాట) సామానులు చూపించింది. గౌనులు లాండ్రీవాడు తెచ్చాడా అని అడిగింది. తల్లి ఊఁ అంది. ఎవరో వచ్చారా అని అడిగింది, తల్లి లేదంది. తల్లి పడుక్కుంది, పిల్ల పడుకోలేదు.

తలుపెవరో తట్టేరు వినా తీసింది. లోపలికి ఎవరో వచ్చేరు. (ఎవరూ కారు, మీరూ నేనూ. పాఠక మహాశయా! మనం ఈమెని అనుసరిస్తున్నాము) జార్జీ వచ్చేడు - జార్జి వినాకి ప్రియుడు, పెళ్ళిచేసుకోవచ్చు.

వినా జీవితం చాలా బాగా సాఫీగా నడుస్తూన్నది. రోజుకో గౌను మారుస్తుంది. నాల్గుజతల జోళ్లున్నాయి, నాల్గురకాల హేటు లున్నాయి టాయిలెట్ సామానులు రెండునెలలకి సరిపోతాయి. విల్సు సిగరెట్లు కాలుస్తుంది. యింతటికీ పిల్లకి వళ్ళున్నాది వంటికి అందంవుంది.

వినాకి చదువు తక్కువకాదు, కాని దీక్షమానదు. ఉద్యోగం చూచుకోగలదు గానీ చెయ్యదు షార్టుహేండు, టైపురైటింగువచ్చు గానీ మర్చిపోయింది. తను చేస్తున్నపని హేయమైనది అని అంతా అంటారు, గానీ తను అనుకోదు. వినా బ్యాంకులో మూడువందల రూపాయిలు నిలవచేసింది.

వారానికోసారి వినాకి పుట్టినరోజు. ఈ ఏడాదిలో వినా యిరవైయైదు పుట్టినరోజు పండుగలు చేసుకొంది. రేపు ఓ సోల్జరుని పండక్కి పిల్చింది. వారం రోజుల తరవాత మరొకడొస్తాడు. విందుకు వచ్చేవాడు పుట్టినరోజని బహుమానాలు తెస్తాడు ఇల్లు నిండుతుంది, కడుపు నిండుతుంది.

జార్జితో వినా 'నేను అలిసిపోయాను' అని చెప్పింది. జార్జి ఏ రోజయినా ఇంతేగా అన్నాడు; జార్జి వినాని ఏమీ కోప్పడడు. యిద్దరికీ ఒకరిసంగతి ఒకరికి తెలుసు.

వినా పాటపాడుతాను అంది జార్జి పియానో వాయిస్తున్నాడు. వినా అది అద్దెకితెచ్చి ఇంట్లో పెట్టుకుంది. వినా పాడుతున్నది. (పాఠక మహాశయా! మనం ఆపాట విందును గాక)

[నాకు ఈకథ చెప్పిందికి చాలావిచారం వేస్తున్నది. గానీ చెప్పకతప్పదు వినా పవిత్రమైన జీవితం గడపడం నాకూయిష్టమే. కాని గడపనంతకాలం గడుపుతున్నది ఎలా రాయను? వినా రోజూ దేముణ్ణి 'ఓ నన్ను కన్నతండ్రీ, నాకూ రోజూ ఓ రొట్టిముక్క యియ్యవోయ్!' అని ప్రార్థిస్తుంది, దేవుడు ఇస్తున్నాడు. ఇచ్చేమార్గం మీకు నచ్చకపోవచ్చు, గానీ మన మేంచెయ్యగలం? వినా బతుకుతున్నది. అందుకు తల్లి ఊ అంది]